సాక్షి రంగారెడ్డి

గురువారం । 23 । నవంబర్ । 2023





అసదుద్దీన్ ఒవైసీ ప్రచారం

రాజేంద్రనగర్: సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని బస్తీల్లో మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఎంఐఎం అభ్యర్థి స్వామియాదవ్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. పతంగి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అసదుద్దీన్ పాదయాత్ర నేపథ్యంలో స్థానిక ప్రాంతాలకు చెందిన మజ్లిస్ పార్టీ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు జిల్లాకు గులాబీ బాస్

- మహేశ్వరం నియోజకవర్గం సుల్తాన్‌పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభ
- ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు
- భారీగా జన సమీకరణపై ఫోకస్
- ఆర్‌సీఐ, శ్రీశైలం జాతీయ రహదారులపై ట్రాఫిక్ ఆంక్షలు



సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం జిల్లాకు రానున్నారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన .. తాజాగా మహేశ్వరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు సుల్తాన్‌పూర్ వేదికగా నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. సీఎం హాజరవుతున్న ఈ సభకు నియోజకవర్గం నుంచి జనాన్ని పెద్ద సంఖ్యలో తరలించాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి సబితారెడ్డి సభాస్థలిని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇరవై ఎకరాల విస్తీర్ణంలో భారీ వేదికతో పాటు మహిళలు, ముఖ్య కార్యకర్తల కోసం పది వేలకు పైగా కుర్చీలు ఏర్పాటు చేశారు. సీఎం రాక నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. శ్రీశైలం జాతీయ రహదారితో పాటు ఆర్సీఐ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. కందుకూరు, మహేశ్వరం, తుక్కుగూడ నుంచి వచ్చే వాహనాలను హౌసింగ్‌బోర్డు సమీపంలో నిలిపివేయనున్నారు. ఆర్కేపురం, సరూర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్ నుంచి వచ్చే వాహనాలను మల్లాపూర్ సమీపంలోనే నిలిపివేయనున్నారు.

పెద్ద సంఖ్యలో తరలిరావాలి

అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారం నిమిత్తం మహేశ్వరం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద యాత్రకు విచ్చేస్తున్న సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలిరావాలని విద్యా శాఖ మంత్రి పి.సబితారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజక వర్గానికి ఇప్పటికే వైద్య కళాశాల, గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, 13 బస్తీ దవాఖానాలు, 8 అర్బన్ హెల్త్ సెంటర్లు, 10 గురుకుల విద్యాలయాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు రూ.833 కోట్ల ప్రత్యేక నిధి, రూ.40 కోట్లతో చెరువుల సుందరీకరణ, రూ.750 కోట్లతో రోడ్ల విస్తరణ, ఆధునీకరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రూ.160 కోట్లు ముఖ్యమంత్రి గారు ప్రత్యేక శ్రద్ధతో మంజూరు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఈ సభకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కారు గుర్తుకే తమ ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే మరింత అద్భుతమైన ప్రగతి సాధించుకోవచ్చని మంత్రి అన్నారు. బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని, నియోజకవర్గ ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయగలరని మంత్రి విజ్ఞప్తి చేశారు.

కర్ణాటక గ్యారెంటీలకే దిక్కులేదు

- తెలంగాణలో నమ్మి మోసపోవద్దు
- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

షాబాద్: కర్ణాటకలో ఇచ్చిన ఐదు హామీలకే దిక్కులేదు.. తెలంగాణలో చేస్తామంటే ఎవరూ నమ్మరని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడ, తాళ్లపల్లి, రుద్రారం, మద్దూరు, నాగర్‌కుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గ్రామాల రూపు రేఖలు మారాయని, అప్పటి వరకు ఏలిన కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఎన్ని గంటల కరెంటు ఇస్తుందో మాట్లాడే దమ్ముందా అన్నారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. రైతుల కష్టాలు తెలిసిన బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, వైస్ చైర్మన్ మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, వెంకటయ్య నాయకులు శ్రీరాంరెడ్డి, సతీష్‌రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణాగౌడ్, పెంటయ్య, స్వర్ణలత, మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.



ప్రజలకు వందనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి తదితరులు

ప్రచారం 'జబర్దస్త్'



సేవాగుణం ఉన్న నేత ఏఐఎఫ్‌బీ షాద్‌నగర్ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి సింహం గుర్తుకు ఓటేసి అసెంబ్లీకి పంపాలని కోరుతూ.. సంగెం, పోల్కోనిగుట్టతండా, ఎక్లాస్ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి, మంగళిగూడ, పాటిగడ్డ, కొనాయపల్లి, సంతాపూర్ గ్రామాల్లో జబర్దస్త్ ఫేం కొమురక్క ప్రచారం చేపట్టారు. – కేశంపేట

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టిన చర్యల గురించి ఆయా జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భారతి హోళికేరి మాట్లాడుతూ.. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశామని, ఓటింగ్ వివరాలతో కూడిన స్లిప్పులను ఇప్పటికే జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో పంపిణీ పూర్తి చేశామని, పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయ్యిందని, కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు. 1,968 మంది 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు ఓట్ ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అర్హులుగా గుర్తించామని, వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఓటును స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఈసీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి గోప్యత పాటిస్తూ ఓటు సేకరణ జరిపేలా గట్టి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. పోలీసులు సహా ఇతర ఎన్నికల విధుల్లో నియమించబడిన సిబ్బంది కోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా 403 ఫిర్యాదులు అందాయని, మొత్తం ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటి కోసం వచ్చే దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ గడువులోపు అనుమతులు జారీ చేస్తున్నామని అన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం రిసీవింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నెలకొల్పి పక్కాగా ఏర్పాట్లు చేశామని, జిల్లాకు కేటాయించబడిన జనరల్ అబ్జర్వర్లు ఇప్పటికే ఈ కేంద్రాలను సందర్శించారని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, సీపీఓ దిలీప్ కుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది సైదులు, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంపే లక్ష్యం

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలు
- పారదర్శకంగా, శాంతియుతంగా ఎన్నికలు
- తనిఖీల్లో రూ.148.98 కోట్లు సీజ్
- 'సాక్షి'తో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి



కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైన పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాం. ఈసారి ఆయా కేంద్రాల్లో ఓటింగ్‌శాతం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేస్తున్నాం. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా, అత్యంత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. ఈ మేరకు బుధవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆమె మాటల్లోనే..

1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం

జిల్లా వ్యాప్తంగా 35,23,219మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18,22,366 మంది పురుషులు, 16,99,600 మంది మహిళా ఓటర్లు, 454 థర్డ్ జెండర్లు, 207 మంది ఎన్‌ఆర్‌ఐలు, 592 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 1,419 ప్రాంతాల్లో 3,453 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,500 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఆయా ఓటర్లకు పోలింగ్ స్లిప్పులను పంపిణీ చేశాం. వందశాతం పోలింగే లక్ష్యంగా ప్రచారం కల్పిస్తున్నాం.

బరిలో 209 మంది అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, కల్వకుర్తి, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల పరిధిలో మొత్తం 280 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. 31 మందిని తిరస్కరించాం. మరో 40 మంది వారి నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం 209 మంది బరిలో ఉన్నారు. వారికి గుర్తులను కూడా కేటాయించాం. పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా ఇప్పటికే మొదటి ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గ కేంద్రాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)లను తరలించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల సంఖ్య కంటే 25 శాతం అదనంగా (రిజర్వు) బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను కేటాయించడం జరిగింది.

పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 80 ఏళ్లు దాటిన వృద్ధులు 43,775 మంది ఉండగా, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు 45,102 మంది ఉన్నారు. వీరంతా ఇంటి నుంచే ఓటు వేసేందుకు వీలుగా ఫారం 12 (డి) పంపిణీ చేశాం. సీక్రెట్ ఓటింగ్ కోసం ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే 13 శాఖల ఉద్యోగులకు సైతం పోస్టల్ బ్యాలెట్ వెసులుబాటు కల్పించాం. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసే అవకాశం ఉండదు.

పోలింగ్ కోసం 15,212 మంది సిబ్బంది

పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు 15,212 మంది ఉద్యోగులను ఎంపిక చేశాం. ర్యాండమైజేషన్ ద్వారా వారికి బాధ్యతలు కేటాయించాం. రెవెన్యూ డివిజన్ల వారీగా ఇప్పటికే పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు శిక్షణ తరగతులు నిర్వహించాం. మైక్రో అబ్జర్వర్లు 280 మంది, పీఓలు 3803 మంది, ఏపీఓలు 3803 మంది, ఓపీఓలు 7,606 మంది ఉన్నారు. ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు, ప్రవర్తనా నియమావళిని ప క్కాగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు వీలుగా 270 సెక్టార్లను ఏర్పాటు చేస్తూ ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాలను నియమించాం.

ఫిర్యాదులపై తక్షణ స్పందన

ఎన్నికల ప్రచార సభలు, సమావేశాల కోసం సువిధ యాప్ ద్వారా దరఖాస్తులకు సకాలంలో అనుమతులు మంజూరు చేస్తున్నాం. సీవిజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 403 ఫిర్యాదులు అందగా వాటిని పరిష్కరించాం. 1950 టోల్ ఫ్రీ, కంట్రోల్ రూంలకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నాం. జిల్లాలోని ఎనిమిది అంతర్ జిల్లా చెక్‌పోస్టుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నిఘా బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించేందుకు వీలుగా అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీ.టీ.జెడ్ కెమెరాలను ఆయా నిఘా బృందాల వాహనాలకు అమర్చాం.

కట్టు దిట్టమైన భద్రత

ప్రశాంతమైన వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టు దిట్టమైన భద్రతను ఏర్పాటు చేశాం. వాహనాల తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు నగదు సహా, మద్యం, బంగారం, ఇతర వస్తువు (రూ.148,98,98,473 విలువ చేసే)లను సీజ్ చేశాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటి వద్ద అదనపు బలగాలను నియమించాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.



జైపాల్ యాదవ్‌కు జై కొట్టండి

బీఆర్‌ఎస్ షాద్‌నగర్ అసెంబ్లీ అభ్యర్థి జైపాల్‌యాదవ్ గెలుపును కోరుతూ ఆయన చిన్న కోడలు హిమబిందు కౌన్సిలర్లలో కలిసి ప్రచారం చేపట్టారు. జైపాల్ యాదవ్‌కు జై కొట్టి 'కారు' గుర్తుకు ఓటేయండి ఓట్లు అభ్యర్థించారు. – షాద్‌నగర్

ఇదిగో కల్లు.. మావైపే మళ్లు!



కులవృత్తులను ఆదుకున్న అధికార బీఆర్‌ఎస్‌కే మరోమారు అవకాశం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్ ఓటర్లను కోరారు. బుధవారం ప్రచారంలో మోకు ధరించి కల్లు ఒంపుతూ వినూత్న ప్రచారం చేపట్టారు. – ఇబ్రహీంపట్నం రూరల్